క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. డాలర్స్‌హిల్స్, తిరుమల హిల్స్, బైయూత్ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని రోడ్డునెంబర్ 13నుంచి 23 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలకాపూర్ రోడ్డు నెంబర్ 24నుంచి 30 వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

బండ్లగూడ: బండ్లగూడ జాగిరు మున్సిపల్ కార్పొరేషన్ పీరంచెరువు మహబూబాసన్ దర్గాలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చింతల యాదగిరి, సాధిక్, మక్బుల్, రియాజ్‌ల ఆధ్వర్యంలో నాజ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దర్గాలో ఛదర్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ప్రార్థనల్లో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చిత్రపురిలో సూర్యారాధన



సూర్యారాధన చేస్తున్న మహిళలు

మణికొండ: చిత్రపురి హిల్స్ సత్సంగ సమాజం ఆదివారం భక్తి శ్రద్ధలతో మహామాఘి, మాఘసాదివారం సందర్భంగా సూర్యారాధన చేశారు. సత్సంగ సమాజం వ్యవస్థాపకులు ఎస్ఎస్ వాజపేయ ఆధ్వర్యంలో కాలనీలోని మహిళలు సామూహికంగా పాలుపొంగించి, సూర్యభగవానునికి నివేదించారు. కార్యక్రమంలో సత్సంగ మహిళలు నళిని, సునీత, కనకదుర్గ, విద్యుల్లత, విజయ, నిర్మళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

చార్మినార్: టీపీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మానిక్‌రావు థాక్రేను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.ఎస్.ఆనంద్‌రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరు హేమలతారెడ్డికి పురస్కారం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గూడూరు హేమలతారెడ్డి స్ఫూర్తి సేవారత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో స్ఫూర్తి సర్వీస్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డును ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

9న ఎల్బీస్టేడియంలో కుస్తీ పోటీలు

గన్‌ఫౌండ్రీ: ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ఎల్బీస్టేడియంలో మల్లయోధ కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.విక్రమ్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఎల్బీస్టేడియంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుస్తీ పోటీలకు ఎంతో మంచి ఆదరణ ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కుస్తీ క్రీడాకారులను గుర్తించి వారికి ఉపకార వేతనాలను అందించడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.35 లక్షలు అందిస్తున్నట్లు వెల్లడించారు. తన తండ్రి మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ జీవితం కుస్తీ పోటీలతోనే ప్రారంభమైందని గుర్తుచేసుకున్నారు. ముఖేష్ గౌడ్ మెమోరియల్ మల్లయుద్ధ టోర్నమెంట్‌ను తెలంగాణ రెజ్లింగ్ సంఘం, హైదరాబాద్ రెజ్లింగ్ సంఘం సహకారాలతో నిర్వహిస్తున్నామన్నారు. బాలకేసరి నుంచి వందకు పైగా కేజీల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ప్లాస్టిక్ సర్జరీ సెంటర్‌ను ప్రారంభించిన హీరో సుశాంత్



గచ్చిబౌలి: కొండాపూర్‌లో రెవెరా ప్లాస్టిక్ సర్జరీ, స్కిన్ కేర్ సెంటర్‌ను హీరో సుశాంత్ తన తల్లి నాగసుశీలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ అఖిలేష్ తోట ఆధ్వర్యంలో నడిచే ఈ ఆస్పత్రిని సుశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితమే నగరంలో ఎక్స్‌క్లూజివ్ ప్లాస్టిక్ సర్జరీ క్లినిక్‌ను ప్రారంభించిన అతికొద్ది మందిలో తోట వెంకట్ ఒకరని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన కుమారుడు అఖిలేష్ కొండాపూర్‌లో మరో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, డాక్టర్ రాజేశ్‌వాసు, శివరాం మల్లెల పాల్గొన్నారు.

ఘనంగా మణికొండ మల్లన్న కల్యాణం



మణికొండ మల్లన్న ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

మణికొండ: ఒగ్గు కళాకారులు డోలు చప్పుల్లు, వేద మంత్రాల మధ్యన మణికొండ మల్లన్న కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆదివారం ఉదయమే దేవాలయానికి చేరుకుని మహిళలు అక్కడే బోనాలను సిద్ధం చేశారు. ఉదయం 11.52గంటలకు మల్లన్న కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దేవాలయ కమిటీ తరఫున పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు తొక్కటం, సదర్‌పటం, ఎల్లమ్మ బోనాలు, రాత్రికి మల్లన్న చరిత్రను ఒగ్గుకథ రూపంలో వినిపించారు. ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సైక్లోథాన్'



సైక్లోథాన్‌లో పాల్గొన్న సైక్లిస్టులు

గచ్చిబౌలి: గచ్చిబౌలి కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు సైక్లోథాన్ నిర్వహించారు. హెమటాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఏఎంవీఆర్ నరేంద్రతో కలిసి మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి జెండా ఊపి సైక్లోథాన్‌ను ప్రారంభించారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకంతో కేన్సర్ వస్తుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి బారిన పడి ఎంతో మంది విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేర్ హస్పిటల్ హెచ్‌సీఓఓ రాజీవ్ ఔరీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధాసిన్హా మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ప్రతి సంవత్సరం కేన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. ఈ వ్యాధిని త్వరగా గుర్తిస్తే చికిత్సతో నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సతీష్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్పొరేటర్, మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తాను బస్తీల్లో తిరిగి ప్రజలను కలుసుకుంటానని ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను వింటూ వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. మజ్లిస్ కార్పొరేటర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆయా ప్రాంతాల సమస్యలను తెలుసుకుంటుండాలని ఆయన అన్నారు. ప్రస్తుతం కార్వాన్ నియోజకవర్గంలో సుమారు రూ.300 కోట్లతో భారీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పనులు పూర్తికాగానే రోడ్డు పనులు కూడా ప్రారంభం అవుతాయన్నారు. అంతేకాకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులతో అభివృద్ధి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్ ఫరాన్, అలీమొద్దీన్, సయ్యద్ జబ్బార్, మజీద్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: జీవనశైలిలో వస్తున్న మార్పులతోనే ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నోషినా డయాగ్నొస్టిక్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నౌషీన్ అన్నారు. ఆదివారం రాప్తా ఫౌండేషన్ ఏంజిల్స్ ఫెర్టిలిటీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఇటువంటి వైద్య శిబిరాల వల్ల ఎందరికో ప్రయోజనం చేకూరుతుందని ఆమె అన్నారు. అంతేకాకుండా సంతాన లేమితో మానసికంగా బాధపడేవారు సైతం ఉచిత వైద్య శిబిరంలో తమ వద్దకు వచ్చి ప్రయోజనం పొందుతున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సీమా, అస్మర్, అన్వర్, హసన్ బావజీద్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో హజ్రత్ అలీ జయంతి ర్యాలీ

చార్మినార్: హజ్రత్ అలీ జయంతి వేడుకలను పురస్కరించుకుని షియా ముస్లింలు పాతబస్తీలోని పలు ప్రాంతాల నుంచి సెహరా-ఈ-ముబారక్ ర్యాలీలు నిర్వహించారు. 78వ జషన్-ఈ-మౌలూద్-ఈ-కాబా వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు అషుర్‌ఖానాల నుంచి బయలుదేరిన ఈ ర్యాలీలు మౌలాలీ వరకు కొనసాగాయి. చార్మినార్ వద్ద దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు ర్యాలీకి స్వాగతం పలికి పూలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హాఫందీ గోల్డీ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

జియాగూడ: చారిత్రాత్మకమైన కాశిబుగ్గ ఆలయ నూతన సంవత్సర కేలండర్‌ను సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని బజరంగ్‌దళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యమన్‌సింగ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కాశిబుగ్గ ఆలయ నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్టి యాదగిరి, బీఆర్ఎస్ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు పట్లూరి రఘు, అన్నపూర్ణ టెంపుల్ చైర్మన్ శ్రీధర్ సాగర్, ఓంసింగ్, అనిల్, విజయ్ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఆల పురుషోత్తమ్‌రావు తదితరులు

అబిడ్స్: దళితుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. గోషామహల్ డివిజన్‌లోని గోడేకబర్‌లో గడ్డం గంగాధర్‌యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో దళితవాడ బస యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దళితుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు, ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా దళిత విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారన్నారు. దళితవాడల బస యాత్రకు విశేష స్పందన లభిస్తుందన్నారు. పోటీ పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు గడ్డం గంగాధర్‌యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, రాంచందర్‌రాజు, స్థానిక నాయకులు సతీష్, వికాస్, ప్రభా, ప్రవీణ్, అంజయ్య, రాము, అశోక్, బి.అర్జున్, ఎ.చిరంజీవి, శంకర్, కవిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తి శివునూర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారులో ఉన్న హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన శ్రీకాంత్, నరేందర్, మధు, రమేష్, డ్రైవర్ శ్రీనివాస్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్లపైనే చెత్త

బండ్లగూడ: చెత్తచెదారాలను రోడ్లపై పడేయడంతో వాటిని తినేందుకు వస్తున్న మూగ జీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కాళీమందిర్ షాదాన్ కళాశాల ప్రాంతంలో డస్ట్‌బిన్‌లు లేకపోవడంతో ప్రజలు చెత్తను రోడ్లపై, ఫుట్‌పాత్‌పై పడేసి వెళ్లిపోతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలలో ప్లాస్టిక్ కవర్లలో తీసుకువచ్చి పడేస్తున్నారు. వీటిని తినేందుకు మూగజీవాలు, ఆవులు, గెదేలు, కుక్కలు, మేకలు రోడ్లపైకి వస్తున్నాయి. ఈ సమయంలో ట్రాఫిక్ జామ్‌తో పాటు అవి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులకు ఈ ప్రాంతంలో డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని, చెత్త వేయకుండా గార్డును ఏర్పాటు చేయాలని కోరిన పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వధువుకు పెళ్లి కానుగా నగదు అందజేసిన సర్పంచ్



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న సర్పంచు రాజ్‌కుమార్.

శంషాబాద్ రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెళ్లి కానుకగా నవ వధులుకు రూ.10,051ను చౌదరిగూడ సర్పంచ్ కె.రాజ్‌కుమార్ ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన సత్తయ్య కూతురు మౌనిక వివాహం సందర్భంగా ఈ నగదును అందజేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాళ్ల శ్రీనివాస్, గ్రామస్తులు సురేష్, నరేస్, లింగం, లక్ష్మణ్, అశోక్, అనిల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన జాతర



మల్లన్న జాతరలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: పట్టణంలోని మెహిదిగార్డెన్‌లో మల్లన్న జాతర వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. మల్లన్న జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి పల్లకి సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించి అన్నప్రసాదం అందజేశారు. అంతకుముందు పట్టణంలోని బసవేశ్వర మఠంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, మాజీసర్పంచ్ ఆర్. గణేష్‌గుప్తా, నార్సింగి మార్కెట్‌కమిటీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్నదానం

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు దాతల సహకారంతో రాత్రిపూట భోజనం అందజేస్తున్నామని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీరుద్దీన్ అన్నాడు. ఆదివారం ఆయన నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వద్ద రాత్రిపూట ఆహారం అందజేశారు.

కాంట్రాక్టర్ల పాత బకాయిలు ఇప్పించండి

అబిడ్స్: మెట్రో వాటర్ బోర్డులోని కాంట్రాక్టర్ల పాత బిల్లులను వెంటనే ఇప్పించాలని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు తెలంగాణ కాంట్రాక్టర్ల జేఏసీ కమిటీ మీడియా ఇన్‌చార్జ్ పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మెట్రో వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్ కాంట్రాక్టర్‌ను వేధిస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పోల్కం శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. గతంలో పనులు చేసిన బిల్లులు వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ ఇవ్వడం లేదని మంత్రికి వివరించారు. లక్షలాది రూపాయాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఎండీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను వేధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. తాను ఎండీ దాన కిశోర్‌తో మాట్లాడి కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని సానుకూలంగా హామీ ఇచ్చారు.



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

పద్మజకు నివాళులర్పించిన ఎమ్మెల్యే



పద్మజ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు పద్మజ శర్మ భౌతిక కాయానికి ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ నివాళులర్పించారు.ఆదివారం చిత్రపురి కాలనీలో ఆమె ఇంటికి వచ్చి నివాళులర్పించారు. పార్టీకి ఆమె మంచి సైనికురాలిగా పనిచేసిందని, ఆమె మృతి పార్టీకి లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి సోలార్ ప్లాంటు అందజేత



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: పదో తరగతి చదువుకుంటున్న ఓ విద్యార్థి ఎన్జీఓ ద్వారా సేకరించిన డబ్బుతో అనాథ ఆశ్రమానికి సోలార్ ప్లాంటు అందజేశాడు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకుంటున్న దర్శ్ తిబ్రేవాలా «ప్రాజెక్ట్ హోప్స్» పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా సేకరించిన విరాళాలలో రూ.7.75లక్షలు వెచ్చించి రాజేంద్రనగర్‌లోని శివరాంపల్లి ప్రాంతంలో ఉన్న వెజ్బల్ బాల్ నివాస్ అనాథశ్రమానికి సమకూర్చిన సోలార్ ప్లాంటును ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో తిబ్రేవాలా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ చైర్మన్ జ్యోతిప్రకాష్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కమిటీ నియామకం



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజన్స్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులుగా పానుగంటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులుగా కె.మధుసుధన్‌రావు, కార్యదర్శిగా సత్తయ్యగౌడ్, కృష్ణారెడ్డి, మంగేష్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారం కోసం కమిటి ఏర్పాటు చేసుకొని పోరాడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.అంజయ్య, సత్యనారాయణ, జి.రాములు, మెతిలాల ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన ఆర్టీసీ ఉద్యోగి



నివాస్‌ను అభినందిస్తున్న మాస్టర్స్ గేమ్స్ సభ్యులు

రాజేంద్రనగర్: జాతీయ స్థాయిలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో మూడు మెడల్స్‌ను సొంతం చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగి కొంగళ్ల శ్రీనివాస్‌ను మాస్టర్స్ గేమ్స్ సభ్యులు అభినందించారు. గచ్చిబౌలిలో ఐదవ జాతీయ మాస్టర్స్ గేమ్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన స్విమింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగి కొంగళ్ల శ్రీనివాస్ పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్స్‌లను సాధించారు. దంతో మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు ఆయనను మెడల్స్‌ను అందజేసి అభినందించారు.

పిల్లలకు మంచి సాహిత్యం అందించాలి



రచయితలను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి

సుల్తాన్‌బజార్: ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు మంచి సాహిత్యం అందించడం ద్వారా సంస్కారయుతమైన నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించగలుగుతామని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యలో ఆదివారం మొట్టమొదటి తెలంగాణ బాల సాహిత్య సమ్మేళనం జరిగింది. తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన బాల సాహిత్య వేత్తలు, పాఠశాలల్లో బాలలను సృజనాత్మక రచయితలుగా, కళాకారులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, బాల సాహిత్య వికాసానికి విశేషంగా కృషి చేస్తున్న అనేక సంస్థల ప్రతినిధులు, కవితలు, కథలు రాస్తూ పుస్తకాలు ప్రచురిస్తూ బహుమతులు అందుకున్నారు. ప్రతిభావంతులైన బాలలు, ఇతర ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ మే నెలలో తెలంగాణ సారస్వత పరిషత్తు 80 ఏళ్ల ఉత్సవం సందర్భంగా అనేక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శాంత బయోటెక్స్ అధినేత పద్మభూషణ్ డాక్టర్ కెఐ.వర ప్రసాద్‌రెడ్డి సమ్మేళనాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. పిల్లలకు నైతిక విలువలు, సత్ప్రవర్తన, పెద్దల పట్ల గౌరవం, మాతృభాషా సంస్కృతులపై అనురక్తి వంటి అంశాలకు సంబంధించిన సమగ్ర రచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పరిషత్తు ప్రధాన ఆర్యదర్శి డాక్టర్ చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి అవార్డు అందుకున్న డాక్టర్ దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, డాక్టర్ పత్తిపాక మోహన్‌లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్వీ.రామారావు, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, మణికొండ వేదకుమార్, మాడభూషి లలితా దేవి రంగినేని మోహన్‌రావు, డాక్టర్ విజయలక్ష్మి, గడిపెల్లి అశోర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.